పన్ను రాయితీని వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఏప్రిల్ 30 తేదీ వరకు పన్ను చెల్లింపుదారులకు ప్రభుత్వం ఇచ్చిన ఐదు శాతం రాయితీని వినియోగించుకోవాలని కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు కోరారు. గురువారం తన చాంబర్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పన్ను రిబేట్ ఇవ్వడం వల్ల ఈ నెల 19 వరకు 760 మంది రూ.2.64 కోట్లు చెల్లించారని తెలిపారు. మరో పది రోజులు మాత్రం సమయం ఉందని, ఆస్తి పన్ను, ఖాళీ స్థలాల పన్ను చెల్లింపు దారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆస్తి పన్ను కట్టేవారు ఏప్రిల్, మే నెలలో ఎటువంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించాలన్నారు. జూన్‌కి రెండు నెలలు పన్ను చెల్లించకపోతే అపరాధ రుసుంతో తర్వాత చెల్లించాల్సి వస్తుందన్నారు. పన్నుల వసూళ్లలో మెరుగుదల ఉందన్నారు. గత ఏడాది మార్చి నెలాఖరికి రూ.24 కోట్లు వసూలు చేస్తే, ఈ ఏడాది రూ.38 కోట్లు వసూలైనట్లు చెప్పారు.

అందని ఆసరా

బటన్ నొక్కి 25 రోజులైనా జమకాని డబ్బులు

ఆందోళనలో డ్వాక్రా సంఘాల మహిళలు



మార్చి 25న స్వయం సహాయక సంఘాల సభ్యులకు నమూనా చెక్కు అందజేస్తున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

అసలే ఆలస్యం... ఆపై నగదు విడుదలలో ఎడతెగని జాప్యం... వెరసి 'ఆసరా' కోసం ఎదురు చూస్తూ తీవ్ర ఆందోళనకు గురౌతున్నారు స్వయం సహాయక సంఘాల మహిళలు. సిఎం జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కి 25 రోజులు కావస్తోందని, రోజూ బ్యాంకు ఖాతాలు చూసుకోవడం తప్ప, అందులో డబ్బులు మాత్రం పడటం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మాత్రం దానికి ఆసరా సంబరాల పేరిట మండల కేంద్రాలకు తీసుకెళ్లడం దేనికని మండిపడుతున్నారు.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

వైసిపి అధికారంలోకి వస్తే స్వయం సహాయక సంఘాల రుణాలను మాఫీ చేస్తానని ఎన్నికలకు ముందు చేపట్టిన పాదయాత్రలో సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అధికారంలోకి వచ్చాక 2019 ఏప్రిల్ 11వ తేదికి ఎస్‌సి, ఎస్‌టి, బిసిలకు చెందిన స్వయం సహాయక సంఘాల సభ్యుల రుణ బకాయి నగదును నాలుగు విడతల్లో తిరిగి సభ్యుల ఖాతాల్లో జమచేస్తామని చెప్పారు. మూడో విడతగా జిల్లాలో 36,463 స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.251.30 కోట్లు అందజేయాల్సి ఉంది. దీనికి సంబంధించిన రాష్ట్ర వ్యాప్తంగా కార్యక్రమాన్ని మార్చి 25న సిఎం జగన్మోహన్‌రెడ్డి ఏలూరు జిల్లా కేంద్రంలో బటన్ నొక్కి ప్రారంభించారు. దీనిపై ప్రభుత్వ ఆదేశాల మేరకు సుమారు పది రోజులపాటు ఈ నెల 5వ తేదీ వరకు మండలాల వారి వైఎస్ఆర్ ఆసరా వేడుకలు నిర్వహించి ఎమ్మెల్యేలు, మంత్రులు, అధికార పార్టీ నాయకులు హడావుడి చేశారు. మండల కేంద్రాల్లో నిర్వహించిన సభలకు స్వయం సహాయక సంఘాల సభ్యులను బలవంతంగా తీసుకెళ్లారు. మార్చి 18 నుంచి 20వ తేదీ వరకు సెర్ప్ కమ్యూనిటీ కోఆర్డినేటర్లు ఆయా పొదుపు సంఘాల సభ్యులందరితో సమావేశాలు కూడా నిర్వహించారు. సిఎం బటన్ నొక్కి 25 రోజులు దాటింది. సంబరాలు ముగిసి 15 రోజులు గడిచిపోయాయి. అయినా ఇప్పటి వరకు 40 శాతం మంది ఖాతాల్లో డబ్బులు జమ కాలేదని సమాచారం. గుర్ల మండలంలో 1256 సంఘాలకు గాను 126 సంఘాలకు ఇప్పటికీ డబ్బులు అందలేదు. దత్తిరాజేరు మండలం పాచలవలసకు చెందిన ఓం నమ:శివాయ స్వయం సహాయక సంఘంలో 12 మంది సభ్యులు ఉన్నారు. వీరందరికి రూ.10 వేలు చొప్పున మొత్తం రూ.1.20 లక్షలు రుణ మాఫీ కింద నగదు అందాలి. ఇప్పటికీ అందలేని ఆ గ్రూపులోని సభ్యులంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాదాపు ఆ గ్రామంలో ఒక్క గ్రూపునకు కూడా ఆసరా డబ్బులు అందలేదని సమాచారం. అన్ని మండలాల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి. దీనికితోడు సాక్షాత్తు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శే రాష్ట్ర ప్రభుత్వ ఖజానా ఖాళీ అయ్యిందంటూ ప్రకటించడంతో ఆసరా కోసం ఎదురు చూస్తున్న మహిళలు ఒకింత ఆందోళనకు గురౌతున్నారు.

గతంలోనూ ఆలస్యమే

వైసిపి అధికారంలోకి వచ్చాక ఆసరా పథకాన్ని అమల్లోకి తెచ్చేసరికి ఏడాది పట్టింది. వైఎస్ఆర్ ఆసరా పేరిట ఈ పథకాన్ని 2020 సెప్టెంబర్ 11న ప్రారంభించారు. ఆ ఏడాది 36,434 స్వయం సహాయక సంఘాలకు రూ.250.54 కోట్లు అందజేశారు. రెండో దశలో 2021 సెప్టెంబర్‌కు బదులు అక్టోబర్ 7న అట్టహాసంగా ప్రారంభించినో అర్హులందరికీ నగదు పడేసరికి ఆ నెలాఖరు అయ్యింది. విడతల వారీగా 36,475 స్వయం సహాయ సంఘాల సభ్యులకు రూ.252.28 కోట్లు అందింది. ఈ లెక్కన మూడో విడత 2022 సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో 36,463 స్వయం సహాయక సంఘాల సభ్యులకు రూ.251.30 కోట్లు అందజేయాల్సి ఉంది. డిసెంబర్ వరకు ఉలుకూ పలుకూ లేకుండా పోయింది. చివరికి డిసెంబర్ చివరిలో 2023 జనవరిలో జమచేస్తామని ప్రభుత్వం చెప్పింది. ఆ తరువాత ఉగాదికి తప్పకుండా ఖాతాల్లో జమ అవుతుందని చెప్పుకొచ్చారు. చివరికి మార్చి 25న అట్టహాసంగా ప్రారంభించారు. కానీ, ఇప్పటికీ డబ్బులు జమకాలేదు.

జీతాల కోసం ఎదురుచూపులు

సమగ్ర శిక్షలో రెండు నెలలుగా అందని వేతనాలు ● రూ.6 కోట్లపైగా బకాయిలు

సమగ్రశిక్ష ఉద్యోగులకు రెండు నెలలుగా వేతనాలు అందడం లేదు. జిల్లాలో వేలాది మంది ఉద్యోగులు ఫిబ్రవరి, మార్చి వేతనాల కోసం ఎదురు చూస్తున్నారు. అరకొర వేతనాలతో నెట్టుకొస్తున్న ఉద్యోగులు.. పండగలు, పర్వదినాల్లోనైనా వేతనాలు పడతాయని ఆశగా ఎదురు చూస్తున్నారు. కానీ ప్రభుత్వం నుంచి స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా వేతనాలు చెల్లించాలని సమగ్ర శిక్ష, డిపిఒ ఉద్యోగులు కోరుతున్నారు.

నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు (ఫైల్)

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలో కెజిబివిలు, భవిత సెంటర్లు, ఎంఆర్‌సి సిబ్బంది.. ఇలా సుమారు 1850 మంది కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు రెండు నెలలుగా వేతనాలు అందలేదు. వీరికి రూ.6.50 కోట్లు వేతనాలు కింద రావాల్సి ఉంది. సమగ్రశిక్ష ప్రాజెక్టు పరిధిలో అధికారులు, కెజిబివి ప్రిన్సిపల్స్, సిఆర్‌డిలు, కంప్యూటర్, ఒకేషనల్ ఇన్‌స్ట్రక్టర్లు, పిజిటిలు, అకౌంటెంట్లు, పిఇటిలు, ఎఎన్ఎంలు, వాచ్ ఉమెన్లు, కుకింగ్ స్టాఫ్, పార్ట్ టైం ఇన్‌స్ట్రక్టర్లు, ఐఇఆర్‌టిలు, ఫిజియోథెరపిస్టులు, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మండల స్థాయి అకౌంటెంట్లు, జిల్లా ప్రాజెక్టు కార్యాలయ సిబ్బంది, మండల, డిపిఒ స్థాయి మెసెంజర్లు, సైట్ ఇంజినీర్లు, ఇతర బోధన, బోధనేతర సిబ్బందికి వేతనాలు అందలేదు. దీంతో వీరి కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

ప్రభుత్వ నిర్లక్ష్యం

జిల్లా వ్యాప్తంగా సుమారు 1850 మంది ఉద్యోగుల పట్ల ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చూపుతోంది. బడ్జెట్ లేదన్న సాకుతో ప్రాజెక్టు ఉన్నతాధికారులు ఉద్యోగులు, సిబ్బందికి జీతాలు వేయలేదు. ఉగాది, శ్రీరామనవమి, గుడ్‌ఫ్రైడే వంటి పండగల సమయాల్లో కూడా జీతాలు రాకపోవడంతో వేతన జీవులు పండగల కోసం అప్పులు చేశారు. ఈ నెల 22న రంజాన్ ఉంది. ఇప్పటి వరకూ జీతాలు రాకపోవడంతో ముస్లిం ఉద్యోగులు, సిబ్బందిలో అసహనం వ్యక్తమవుతోంది. ప్రాజెక్టుకు గతంలో ప్రత్యేకంగా కేటాయించిన బడ్జెట్ నుంచి ఉద్యోగులకు వేతనాలు చెల్లించేవారు. ఈ ఏడాది కూడా కొత్త బడ్జెట్‌ను కేంద్రం మంజూరు చేసింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఈ బడ్జెటు ప్రాజెక్టులకు కేటాయించలేదు. అందుకే ఉద్యోగులకు జీతాల వేదన తప్పడం లేదు.

ఒకటో తేదికే వేతనాలు చెల్లించాలి

కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు ఇచ్చే వేతనాలు అరకొరే. అవి కూడా సక్రమంగా ఇవ్వకపోవడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. ఒకటో తేదీకి వేతనాలు చెల్లించాల్సిన ప్రభుత్వం రెండు నెలలుగా బకాయిలు పెట్టడం బాధాకరం. ప్రతి నెలా వేతనాల కోసం ఎదురు చూపులు చూడాల్సి వస్తోంది. ఏడాదికి సరిపడే బడ్జెట్ విడుదల చేసి ప్రతి నెలా వేతనాలు చెల్లించాలి.

- బి.కాంతారావు, ఎపి సమగ్ర శిక్ష కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి చైర్మన్

2 అడుగుల సందు కోసం..

అన్నపై హత్యాయత్నం

ప్రజాశక్తి-బొబ్బిలి

చికిత్స పొందుతున్న కృష్ణ

రెండు అడుగుల ఇంటి సందు కోసం అన్నపై తమ్ముడు పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఈ సంఘటన పట్టణంలో గురువారం తెల్లవారు జామున చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..

పట్టణంలోని పాతబొబ్బిలికి చెందిన గుణుపూరు కృష్ణ, తమ్ముడు గోపాల్ మధ్య రెండు అడుగుల ఇంటి సందు కోసం వివాదం సాగుతోంది. ముందు భాగాన ఉన్న కృష్ణ.. వెనుక ఇంటిలో ఉంటున్న గోపాల్‌కు నడక దారి కోసం రెండు అడుగులను కేటాయిస్తూ అన్నదమ్ముల పంపకాలలో గ్రామ పెద్దలు తీర్మానించారు. కృష్ణ మాత్రం వినకుండా ఇబ్బందులు పెట్టడంతో పోలీసులకు గోపాల్ ఫిర్యాదు చేశాడు. గురువారం సాయంత్రం స్టేషన్‌కు రావాలని పోలీసులు సమాచారం ఇచ్చారు. తెల్లవారుజామున 4 గంటల సమయంలో వరండాలో నిద్రిస్తున్న అన్నయ్య కృష్ణపై గోపాల్ పెట్రోల్ పోసి నిప్పంటించాడు. ఆయన కేకలు వేయడంతో స్థానికులు వచ్చి మంటలను ఆర్పి, గాయపడిన కృష్ణను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి, అక్కడి నుంచి విశాఖ రిఫర్ చేశారు. కృష్ణ పరిస్థితి విషమంగా ఉన్నట్టు కుటుంబ సభ్యులు చెపుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మణికంఠకు డిప్యూటీ స్పీకర్ అభినందన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

టిసిఎస్ కంపెనీ నిర్వహించిన వ్యాసరచన పోటీలలో సత్తాచాటి, ఈ నెల 17న ఢిల్లీలో రాష్ట్రపతి నుండి పురస్కారం పొందిన కస్పా పాఠశాల విద్యార్థి కొంతల మణికంఠను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సత్కరించి అభినందించారు. ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో కస్పా హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఆర్.శంకరరావు, వంకా రమణ, గణిత ఉపాధ్యాయులు జివిబి సూర్యనారాయణ రాజు, సైన్స్ మాస్టర్ రామునాయుడు, పీడీ గోపాల్ పాల్గొన్నారు.

ఏకగ్రీవాలకు ప్రోత్సాహమేదీ?

* ఎదురుచూస్తున్న పంచాయతీ పాలకవర్గాలు
* కుంటుపడుతున్న అభివృద్ధి
* ఆర్థిక సంఘం నిధులతోనే సరిపెట్టుకుంటున్న పంచాయతీలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2021 ఫిబ్రవరిలో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగాయి. ఏకగ్రీవ పంచాయతీలకు జనాభా ప్రాతిపదికన రూ.7 లక్షల నుంచి 10 లక్షల వరకు ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంతో గ్రామాభివృద్ధిని ఆశించి పలు గ్రామ పంచాయతీలో పెద్దలు సమావేశాలు ఏర్పాటు చేసుకుని ఏకగ్రీవంగా సర్పంచులను ఎన్నుకున్నారు.. అయితే రెండేళ్లు గడిచినా ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహక నిధులు విడుదల చేయలేదు. దీంతో ఆయా గ్రామాల సర్పంచులు ఆవేదన చెందుతున్నారు. ఎన్నికైన వెంటనే సాధారణ నిధులతోపాటు ప్రోత్సాహక నిధులు వస్తే గ్రామాలను మరింత అభివృద్ధి చేసుకుందామన్న సర్పంచుల కలలు కలగానే మిగిలాయి. నిధులు లేక చిన్నపాటి సమస్యలను సైతం పరిష్కరించలేక ప్రజలకు సమాధానం చెప్పుకోలేని పరిస్థితుల్లో గ్రామపంచాయతీ పాలకవర్గాలు నలిగిపోతున్నాయి.

ప్రజాశక్తి-రేగిడి

2021 ఫిబ్రవరిలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో 955 గ్రామ పంచాయతీలకు గాను 146 చోట్ల ఏకగ్రీవ ఎన్నిక జరిగింది. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో రేగిడి మండలంలో ఒప్పంగి, సరసనాపల్లి, కొర్లవలస, కొమిరి, వన్నలి ఏకగ్రీవ గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మొత్తం ఏకగ్రీవ పంచాయతీలకు రూ.18.55 కోట్లు ప్రోత్సాహక నిధులు మంజూరు చేయాల్సి ఉండగా, నేటి వరకు నిధులు రాకపోవడంతో అభివృద్ధి పనులు చేయలేని పరిస్థితి నెలకొంది.

గ్రామపంచాయతీలకు 14 ,15వ ఆర్థిక సంఘం నిధులు జనాభా ప్రాతిపదికన కేటాయిస్తుంటారు. ఇవి కాకుండా స్టేట్ ఫైనాన్స్, కార్పొరేషన్ ద్వారా నిధులు మంజూరు చేస్తారు. ఏకగ్రీవ పంచాయతీలకు మంత్రులు, ఎమ్మెల్యేలు కోటా నుంచి మరో ఐదు లక్షలు వెచిస్తామన్నా ప్రకటనలు కూడా అమలుకు నోచుకోలేదు. తాజా రాజకీయ పరిస్థితుల్లో ఎన్నికల ఎంతో ఖర్చుతో కూడుకున్నవి. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ వ్యయం గణనీయంగా పెరిగి ప్రభుత్వానికి భారంగా మారింది. ఒక్కో గ్రామానికి కనీసం లక్ష వరకు వెచ్చించవలసి వస్తుంది. జనాభాకు అనుగుణంగా ఈ ఖర్చు కొంత అటు ఇటుగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణ భారాన్ని తగ్గించుకోవడంతో పాటు శాంతిభద్రతల పరిరక్షణకు ప్రభుత్వాలు ఏకగ్రీవ పంచాయతీలకు నజరానాలు ప్రకటిస్తూ వస్తున్నాయి. జనాభా ఆధారంగా నిధులు కేటాయింపుల్లో చిన్న పంచాయతీలకు పెద్దగా ఆర్థిక ప్రయోజనం చేకూరడం లేదు. కొత్తగా ఏర్పడిన పంచాయితీల్లో జనాభా తక్కువగా ఉంది. ఫలితంగా ప్రోత్సాహక నిధుల కోసం పాలకవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్న ప్రజలకు నిరాశే మిగిలింది. ఇప్పటికైనా ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహక నిధులు మంజూరు చేయాలని గ్రామ పంచాయితీ సర్పంచ్, పాలకవర్గ సభ్యులు కోరుతున్నారు.

ప్రోత్సాహం కోసం ఎదురుచూపు

అభివృద్ధి జరుగుతుందనే ఆశతో గ్రామ పెద్దలతో సంప్రదించి ఒప్పంగి పంచాయతీని ఏకగ్రీవం చేసుకున్నాం. రెండేళ్ల గడిచినా ప్రోత్సాహకం లేదు. 14, 15 ఆర్థిక సంఘం నిధులతోనే గ్రామాన్ని అభివృద్ధి చేసుకుంటున్నాం. ప్రభుత్వం ఏకగ్రీవ పంచాయతీలకు ప్రోత్సాహకం అందించాలి.

- గంటా మంగమ్మ, ఒప్పంగి, రేగిడి పంచాయతీ

నిధులు విడుదల చేయాలి

ఏకగ్రీవ పంచాయతీలకు తక్షణమే ప్రోత్సాహక నిధులు విడుదల చేస్తే గ్రామాల అభివృద్ధి చెందుతాయి. ఐదేళ్లకు జరిగే ఎన్నికల్లో ఏకగ్రీవ పంచాయతీలకు వెను వెంటనే నిధులు మంజూరు చేస్తే బాగుంటుంది. రెండేళ్ల గడిచినా ఎంతవరకు ప్రోత్సాహకాలు అందడం లేదు.

- కర్రి మీనమ్మ, సరసనాపల్లి పంచాయతీ, రేగిడి మండలం

ప్రోత్సాహక నిధులు రాగానే ఖాతాల్లో జమ

స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామ పంచాయతీలకు ప్రోత్సాహక నిధులు రాగానే ఆయా పంచాయతీ ఖాతాల్లోకి జమ చేస్తాం. ఇంతవరకు నిధులు రాలేదు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తాం.

- శ్రీధర్ రాజా, డిపిఒ, విజయనగరం

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కమిషనర్ శ్రీరాములునాయుడు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ ప్రాధాన్యత అంశాల అమల్లో నిర్లక్ష్యం ఉండరాదని సచివాలయ కార్యదర్శులకు నగరపాలక సంస్థ కమిషనర్ ఆర్.శ్రీరాములునాయుడు హెచ్చరించారు. గురువారం నగరంలోని 38వ నంబర్ సచివాలయంలో 10, 32, 33, 34, 35, 36, 37, 38 సచివాలయాల కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. సులభతరమైన పౌరసేవలు అందించడంలో కార్యదర్శులు ఉదాసీనంగా ఉండరాదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసిందన్న విషయాన్ని కార్యదర్శులు మర్చిపోరాదని చెప్పారు. రికార్డుల నిర్వహణలో, సిటిజన్ చార్ట్ అమల్లో నిర్లక్ష్యం వద్దన్నారు. నిర్లక్ష్యం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు సివిల్ సర్వీసెస్ డే

ప్రజాశక్తి-విజయనగరం

సివిల్ సర్వీసెస్ డే వేడుకలను శుక్రవారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్ ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులంతా హాజరు కావాలని ఆమె ఒక ప్రకటనలో కోరారు.

నేడు ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి-విజయనగరం

రంజాన్ మాసం సందర్భంగా జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేస్తున్నారుక. అతిథులంతా స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ సమీపంలోని రెవెన్యూ కల్యాణ మండపంలో సాయంత్రం 6 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి లావణ్య కోరారు.

బీమా పథకాలతో ప్రయోజనం

జూన్ 30 వరకు గ్రామ స్థాయి అవగాహన సదస్సులు ● బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ నాగలక్ష్మి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి

ప్రజాశక్తి-విజయనగరం

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పిఎం జీవన్ జ్యోతి బీమా యోజన, పిఎం సురక్ష బీమా యోజన పథకాలను ప్రజలంతా సద్వినియోగం చేసుకునేలా అవగాహన కలిగించాలని కలెక్టర్ నాగలక్ష్మి తెలిపారు. బ్యాంకు ఖాతాలు ఉన్న వారంతా ఈ బీమా పథకాలకు అర్హులేనని, జిల్లాలో ఉన్న హైరిస్క్ ప్రజలంతా తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కోరారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం బ్యాంకర్లతో కేంద్ర ప్రభుత్వ బీమా పథకాల నమోదుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. పిఎం జీవన్ జ్యోతి పథకం కింద 18 నుండి 50 ఏళ్ల వయసు వారు ఏడాదికి రూ.436 చెల్లిస్తే రూ.2 లక్షల ఇన్సూరెన్స్ వస్తుందని తెలిపారు. పిఎం సురక్షా బీమా కింద 18 నుండి 70 ఏళ్ల వారు రూ.20 చెల్లిస్తే ప్రమాద బీమా కింద రూ.2 లక్షల వరకు చెల్లిస్తారని, ప్రమాదంలో అంగవైకల్యం కలిగిన వారికీ వర్తిస్తుందని వెల్లడించారు. ఈ పథకాలలో నమోదు చేయడానికి జూన్ 30 వరకు ప్రతి గ్రామంలో అవగాహన సదస్సులు నిర్వహించాలని బ్యాంకర్లకు తెలిపారు. లక్ష్యాలతో సంబంధం లేకుండా జిల్లాలో ఉన్న ఉపాధి కూలీలను, ఆటో డ్రైవర్లను, డ్వాక్రా మహిళలను, కల్లు గీత కార్మికులను, భవన కార్మికులను.. ఇలా హైరిస్క్ ఉన్న రంగాల్లో పనిచేస్తున్న వారందరినీ ఈ పథకం కింద నమోదు చేయాలని సూచించారు. ప్రతి వారం నమోదు వివరాల నివేదికను తనకు అందజేయాలని కలెక్టర్ సూచించారు.

కార్యక్రమాల్లో బ్యాంకర్లే కాకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. బ్యాంకు అధికారులు జగనన్న తోడు, పంట రుణాల మంజూరు, పరిశ్రమలకు ప్రోత్సహించే రుణాల లక్ష్యాలపై కూడా దృష్టి పెట్టాలన్నారు. సమావేశంలో ఎల్‌డిఎం శ్రీనివాసరావు, నాబార్డు డిడి నాగార్జున, డిఆర్‌డిఎ పీడీ కళ్యాణచక్రవర్తి, జిల్లా పరిషత్తు సిఇఒ అశోక్ కుమార్, డిపిఒ శ్రీధర్ రాజు, డిఎల్‌డిఒ నిర్మలా కుమారి, పలు బ్యాంకుల ప్రతినిధులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం

నిక్షయ మిత్ర కార్యక్రమంలో భాగంగా ఎన్‌సిఎస్ చారిటబుల్ ట్రస్ట్ 53 మందికి, మేక కాశీవిశ్వేశ్వరుడు 16 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం అందించేందుకు ఆర్థిక సాయం చేశారు. మొదటి విడతగా గతేడాది డిసెంబరులో పంపిణీ చేశారు. రెండో విడతగా గురువారం పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో దాతలు నారాయణం నీరజ శ్రీవల్లి, మేక కాశీవిశ్వేశ్వరుడు, జిల్లా టిబి కంట్రోల్ ఆఫీసర్ ఎన్.సూర్యనారాయణ, రెడ్‌క్రాస్ చైర్మన్ కె ఆర్ డి ప్రసాదరావు, కార్యదర్శి కె.సత్యం, కోశాధికారి టి. రామారావు పాల్గొన్నారు.

పింఛను 10 వేలకు పెంచాలి

ఎమ్‌పికి ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎమ్‌పికి వినతి అందిస్తున్న అసోసియేషన్ నాయకులు

ఇపిఎఫ్ పింఛను రూ.10 వేలకు పెంచాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శేషగిరి, ప్రధాన కార్యదర్శి నాగభూషణం కోరారు. గురువారం ఎమ్‌పి బెల్లాన చంద్రశేఖర్‌కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం హైయ్యర్ పెన్షన్ కోసం ఆప్షన్ ఇచ్చుకొనే విషయంలోనూ కేంద్రప్రభుత్వం, ఇపిఎఫ్ఒ కార్యాలయం పెన్షనర్లు, కార్మికులతో చెలగాటం ఆడుతున్నాయన్నారు. కనీస పెన్షన్ రూ.10 వేలు డిఎతో కలిపి చెల్లించాలని కోరారు. హైయ్యర్ పెన్షన్ కోసం ఆప్షన్ అనుమతించాలన్నారు. ఇపిఎఫ్ పెన్షనర్ల సమస్యలపై వచ్చే పార్లమెంటు సమావేశాలలో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఎమ్‌పిని కోరారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్లు పాల్గొన్నారు.

ఉత్తరాంధ్ర అభివృద్ధికి కలిసిరావాలి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

ఉత్తరాంధ్ర అభివృద్ధి కోసం అందరూ కలిసి రావాలని ఉత్తరాంధ్ర పార్టీ వ్యవస్థాపకులు మెట్ట రామారావు, జిల్లా అధ్యక్షులు పేడాడ జనార్ధనరావు ఒక ప్రకటనలో కోరారు. దశాబ్దాలుగా ఉత్తరాంధ్ర పూర్తిగా నిర్లక్ష్యానికి గురైందని ఆవేదన వ్యక్తంచేశారు. ఎన్నో సహజ వనరులున్న ఉత్తరాంధ్ర అభివృద్ధికి నోచుకోకపోగా, గతం నుంచీ ఇక్కడి సంపదను కొల్లగొట్టి రాయలసీమ, తెలంగాణ నాయకులు తమ ప్రాంతాలను అభివృద్ధి చేసుకున్నారని తెలిపారు. విశాఖలో కూడా వ్యక్తిగతంగా ఆస్తులు సమకూర్చుకున్న నాయకులు ఈ ప్రాంత అభివృద్ధిపై ఏనాడూ దృష్టి పెట్టలేదని పేర్కొన్నారు. నాలుగేళ్లుగా అధికారంలో ఉన్న వైసిపి ప్రభుత్వం సైతం విశాఖకు రాజధానిని మరలిస్తామనే నెపంతో ఓటు బ్యాంకు రాజకీయాలను నడుపుతోందని తెలిపారు. అందుకే రాజధాని తరలింపు విషయంలో సరైన నిర్ణయం తీసుకోకుండా తాత్సారం చేస్తూ ముఖ్యమంత్రి ఉత్తరాంధ్ర ప్రజల సెంటిమెంటుతో ఆడుకుంటున్నారని చెప్పారు.

ఆంధ్రా ద్రోహి మోడీ

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకరరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా, విభజన హామీలు అమలు చేయకుండా వదిలేసి, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేస్తున్న ఆంధ్రాద్రోహి మోడీని గద్దె దించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని కరకవలస, ఇందిరమ్మ కాలనీలో ప్రచారభేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.రమణమ్మ అధ్యక్షతన జరిగిన సభలో రెడ్డి శంకరరావు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అప్పనంగా పెట్టుబడిదారులకు కట్టబెట్టిన ప్రభుత్వరంగ సంస్థల పరిరక్షణ కోసం వామపక్షాలు పోరాడుతున్నాయని చెప్పారు. రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాతంత్ర హక్కుల కోసం ఉద్యమిస్తున్నాయని వెల్లడించారు. ఇది అసలైన దేశభక్తి పోరాటమన్నారు. తొమ్మిదేళ్ల బిజెపి పాలనలో పథకం ప్రకారం మత విద్వేషాలు రెచ్చగొట్టడం, రాజ్యాంగాన్ని, లౌకికతత్వాన్ని విధ్వంసం చేయడం, కార్పొరేట్ల దేశంగా మార్చడం, మోడీ చేస్తున్న దుర్మార్గాలను ప్రశ్నించే వారిపై కేసులు నమోదు చేయడం సాగుతోందని ఆందోళన వ్యక్తంచేశారు. ఇదెక్కడి దేశభక్తి అని ప్రశ్నించారు. కోట్లాదిమంది ప్రజలు పెరుగుతున్న ధరలు భరించలేక తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లోకి వెళుతున్నారని ఆవేదన చెందారు. మన రాష్ట్రానికి ప్రత్యేక హోదా, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వలేదని ఆక్షేపించారు. రాష్ట్రంలో ప్రధాన రాజకీయ పార్టీలు మోడీని ఒక్క మాట అనడానికి భయపడుతున్నాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో బుచ్చిబాబు, చక్రి, రమ, అమ్మాజమ్మ, తదితరులు పాల్గొన్నారు. తోటపాలెంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జగన్‌మోహన్, వెంకటేష్, తదితరులు ప్రచారం నిర్వహించారు. గాజులరేగలో సిపిఎం నాయకులు బి.రమణ, కంది త్రినాథ్, బజ్జమ్మ, కొండమ్మ తదితరులు ఇంటింటికీ ప్రచారంలో పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు

చెరువుల్లో విచ్చలవిడిగా మట్టి తవ్వకాలు

ప్రజాశక్తి - బొబ్బిలి

బొబ్బిలి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విచ్చలవిడిగా మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. చెరువులు, ప్రభుత్వ స్థలాల్లో రాత్రి సమయాల్లో అక్రమంగా మట్టి తవ్వకాలు జరిపి అమ్ముకుని అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకోవాల్సిన యంత్రాంగం చూసీచూడనట్లు వ్యవహరిస్తుంది. అనుమతులు తీసుకుని మట్టి తవ్వకాలు జరపాల్సి ఉన్నప్పటికీ పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. రెండు రోజుల క్రితం మట్టి తవ్వకాలపై మైనింగ్ అధికారులు దాడి చేసినప్పటికి మొక్కుబడిగా అపరాధ రుసుము విధించి మట్టి మాఫియాకు కొమ్ము కాసినట్లు ఆరోపణలు వస్తున్నాయి.

చెరువులలో అక్రమ తవ్వకాలు

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న చెరువులలో అక్రమంగా మట్టి తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. పట్టణ సమీపంలో ఉన్న కోటి చెరువు, గ్రోత్ సెంటర్‌కు అనుసరించి ఉన్న స్వామివారి చెరువు, ఎం.బూర్జవలస, పనుకువలస, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పలు చెరువులలో మట్టిని అక్రమంగా తవ్వి సొమ్ము చేసుకుంటున్నారు. మట్టి తవ్వకాలతో చెరువులలో పెద్దపెద్ద గోతులు ఏర్పడడంతో వర్షా కాలంలో వరదనీరు చేరి పశువులు, పశువుల కాపర్లు, పొలానికి నీరు కోసం చెరువులలో దిగే రైతులు గోతులలో దిగడంతో మృత్యువాత పడుతున్నారు. గున్నతోటవలస చెరువులో ఏడాది క్రితం ఒక రైతు గోతిలో పడి మరణించాడు.

రాత్రి సమయాల్లో మట్టి తవ్వకాలు

రాత్రి సమయాల్లో మట్టి తవ్వకాలు చేస్తున్నారు. మట్టి తవ్వకాలపై రెవెన్యూ, మైనింగ్ అధికారులకు సమాచారం ఉన్న పట్టించుకోవడం లేదని విమర్శలు వస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో పగటి పూట కూడా మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. అక్రమ మట్టి తవ్వకాలను నివారించాలని ప్రజలు కోరుతున్నారు.

జామి: మట్టి తరలింపునకు సిద్ధంగా ఉన్న ట్రాక్టర్లు

తూతుమంత్రంగా దాడులు

మట్టి అక్రమ తవ్వకాలపై మైనింగ్ అధికారులు తూతుమంత్రంగా దాడులు చేస్తున్నారు. రెండు రోజుల క్రితం మట్టి తవ్వకాలపై దాడులు చేసినప్పటికీ తూతు మంత్రంగా చర్యలు తీసుకున్నారు. బొబ్బిలిలో మట్టి అక్రమంగా తరలిస్తున్న మూడు టిప్పర్లు, నాలుగు ట్రాక్టర్లు పట్టుకున్న మైనింగ్ అధికారులు నాలుగు ట్రాక్టర్లపై కేసు నమోదు చేసి టిప్పర్లపై కేసు నమోదు చేయకుండా విడిచిపెట్టినట్లు ఆరోపణలు వస్తున్నాయి. మట్టి తవ్వుతున్న జేసిబిను ఎందుకు పట్టుకుని కేసు నమోదు చేయలేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. జేసిబి యజమానులతో మైనింగ్ అధికారులు కుమ్మక్కైనట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా మైనింగ్ అధికారులు స్పందించి మట్టి అక్రమ తవ్వకాలను ఆపాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

దాసన్న చెరువులో అక్రమ తవ్వకాలు

జామి : మండలంలోని మోకాస కొత్తవలస రెవెన్యూలోని దాసన్న చెరువు అక్రమార్కులకు కాసులు కురిపిస్తోంది. ఎటువంటి అనుమతులూ లేకుండా అడ్డగోలుగా అక్రమార్కులు మట్టిని తవ్వి తరలిస్తున్నారు. దీని వెనుక మండల అధికార పార్టీ పెద్ద కీలకంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో అడ్డూ అదుపు లేకుండా యధేచ్ఛగా అక్రమార్కులు చెరువును కొల్లగొడుతున్నారు. కొంత మంది స్థానికులు అడ్డుకుంటున్నా... తవ్వకాలు ఆగడం లేదని వాపోతున్నారు.

మండలంలోని మోకాస కొత్తవలస గ్రామంలో దాసన్న చెరువు సుమారుగా 50 ఎకరాల్లో ఉంది. ఇది సుమారు 200 ఎకరాలకు పైగా వ్యవసాయ భూమికి జలాధారం. ఇటీవల దీనిపై స్థానిక వైసిపి పెద్ద కన్ను పడింది. తన ప్రైవేటు స్థలం కప్పుకునెందుకు చెరువులో తవ్వకాలు ప్రారంభించారు. ఇదే అదునుగా ఇటుక బట్టీలకు, ఇతర మట్టి అవసరాలకు చెరువు కేంద్రంగా మారింది. స్థానిక పంచాయితీ పెద్దలు సహకరించడం తో వారికి కొంత ముట్టజెప్పి, యధేచ్ఛగా టాక్టర్లతో మట్టిని తవ్వి తరలిస్తున్నారు. అడిగిన వారిని భేఖాతర చేస్తూ, తవ్వకాలను ఎవరూ ఆపలేరని కరాఖండీగా అక్రమాన్ని సాగిస్తున్నారు. అధికార పెద్దలు జోక్యం ఉండడంతో అధికారులు కూడా చూసీ చూడనట్లు వదిలేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై స్థానిక తహశీల్దార్ హేమంత్ కుమార్‌ను ' ప్రజాశక్తి ' వివరణ కోరగా, తన దృష్టికి వచ్చిన వెంటనే రెవెన్యూ సిబ్బందిని పంపి, నిలుపుదల చేసినట్లు తెలిపారు. తవ్వకాలపై చర్యలు తీసుకుంటామని అన్నారు.

కార్పొరేట్ విధానాలను వ్యతిరేకించండి

బొబ్బిలి : మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక నిరంకుశ, మతోన్మాద విధానాలపై సిపిఐ, సిపిఎం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో ఉన్న బజార్ సెంటర్‌లో నాయకులు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న, పట్టణ కార్యదర్శి మునకాల శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ప్రజలను నట్టేట ముంచి కార్పొరేట్ కొమ్ముకాస్తుందన్నారు. విద్యా రంగాన్ని కాషాయానికి అప్పచెప్పుతున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి బి. రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లు నిర్మించాలి

బొబ్బిలి : ప్రతిరోజు బొబ్బిలి పట్టణానికి అనేక గ్రామాల నుంచి పురుషులు, మహిళలు, వ్యాపారస్తులు, స్టూడెంట్స్ వేలాది మంది వస్తున్నారని వారికి పబ్లిక్ టాయిలెట్స్ చేయాలని ఏపి కాంగ్రెస్ కమిటీ మెంబర్ ముద్దల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడారు. పట్టణంలో జనాదరణ ఉన్న సెంటర్లను గుర్తించి పే అండ్ యూస్ పబ్లిక్ టాయిలెట్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు.

ఘనంగా శంబంగి జన్మదిన వేడుకలు

బొబ్బిలి : ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వైసిపి నేతలు, కార్యకర్తలు సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే శంబంగికి వైసిపి మండల, పట్టణ అధ్యక్షులు శంబంగి వేణు, ఇంటి గోపాలరావు, మున్సిపల్ చైర్మన్ సావు మురళి, ఏఎంసి చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలు శుభాకాంక్షలు చెప్పారు. ఆర్టీసీ కాంప్లెక్స్, గొల్లవీధి, బజారులో వైసిపి పట్టణ నేతలు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

శృంగవరపుకోట : మండలంలోని జాతీయ అగ్నిమాపక వారోత్సవాలు గురువారంతో ముగిసాయని అగ్నిమాపక అధికారి షేక్ మదీనా తెలిపారు. ఈ సందర్భంగా ఆఖరి రోజు అగ్నిమాపక కేంద్రంలో గల స్థానిక ప్రజలకు, సిబ్బందికి ఫైర్ సేఫ్టీ పై వర్క్ షాప్ నిర్వహించారు. అగ్ని ప్రమాదాలు, గ్యాస్ లీకేజ్ వంటివి సంభవించినపుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, నివారణ పద్ధతులు గురించి ఆయన వివరించారు. అనంతరం అగ్నిమాపక కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంలో మజ్జిగ పంపిణీ చేశారు.

ఉపాధి పనుల పరిశీలన

గజపతినగరం : మండలంలోని నీల్ల సాగరం చెరువు పనులను ఎంపిడిఓ పి.సురదన్ గురువారం పరిశీలించారు. నిర్ణీత కొలతలకు పనిచేసి దానికి తగ్గ కూలిని సంపాదించుకోవాలని అన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని వడదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

ఎమ్మెల్యేకు బేబినాయన సెల్ఫీ ఛాలెంజ్

బొబ్బిలి : టిడిపి హయాంలో నిధులు కేటాయించి నిర్మాణ పనులు ప్రారంభించిన ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు పూర్తి చేయాలని టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే శంబంగి పుట్టిన రోజు సందర్భంగా పుట్టినరోజు శుభాకాంక్షలు చెప్పి బేబినాయన సెల్ఫీ ఛాలెంజ్ చేశారు. టిడిపి హయాంలో పనులు ప్రారంభిస్తే వైసిపి హయాంలో ఒక ఇటుక కూడా వేయలేదన్నారు. ఇండోర్ స్టేడియం నిర్మాణం బొబ్బిలి క్రీడాకారులు, ప్రజల ఆకాంక్ష అన్నారు. వచ్చే పుట్టినరోజు నాటికి ఇండోర్ స్టేడియం నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే శంబంగిను కోరారు. ఆయనతో మెట్టవలస సర్పంచ్ పువ్వల మాధవ ఉన్నారు.

మత విద్వేషాలపై చర్యలు

బొబ్బిలి: బొబ్బిలిలో ఎన్నో సంవత్సరాలుగా అన్నదమ్ములు మాదిరిగా కలిసిమెలిసి జీవిస్తున్న హిందూ, ముస్లిం, క్రిస్టియన్ వర్గాల మధ్య కొంతమంది బయట వ్యక్తులు వచ్చి, మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా మాట్లాడడం చాలా బాధాకరమైన విషయమని అటువంటివి పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని బొబ్బిలి డిఎస్పి బి మోహన్ రావుకు, బొబ్బిలి పాస్టర్స్ ఫెలోషిప్ అసోసియేషన్ ప్రతినిధులు గురువారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రతినిధులు మాట్లాడుతూ, కొద్ది రోజుల క్రితం రాధా మనోహర్ దాస్ అనే వ్యక్తి బొబ్బిలి పట్టణం వచ్చి, శ్రీ వేణుగోపాల స్వామి వారి సన్నిధానంలో మత విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా మాట్లాడడని అతనిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిపిఎఫ్ఎ ప్రతినిధులు సిహెచ్ జయరాజు, బి. గోపాల్, పిటి నాయుడు, ప్రేమానంద్ సామ్సన్, ఇశ్రాయేలు, ఎస్ డానియల్, తోట రాజేష్, ఎం థామస్, విజయ్ కుమార్ పాల్గొన్నారు.

గిరిజనులకు పట్టాలు పంపిణీ

బొబ్బిలిరూరల్ : మండలంలోని కాసిందొరవలస పంచాయతీ పరిధిలో ఎరకం దొరవలస గిరిజనులు సాగు చేసుకొంటున్న అటవీ భూముల పట్టాలను గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ ప్రభుత్వం హరిజన, గిరిజన పక్ష పాతి అని అన్నారు. అనంతరం 17 మంది గిరిజనులు సాగు చేసుకొంటున్న 45 ఎకరాలకు సంబంధించిన పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ శేషశైలజ, తహశీల్దార్ రాజారావు, సిఎస్‌డిటి సాయి కృష్ణ పాల్గొన్నారు.

ఎస్ఐగా జనార్ధనరావు

వంగర : స్థానిక ఎస్ఐగా జనార్ధనరావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంత వరకు ఇక్కడ పని చేసిన ఎస్ఐ బుడు మూరు లోకేశ్వరరావు సంతకవిటి ఎస్ఐగా బదిలీ కావడంతో ఆ స్థానంలో సంతకవిటిలో పనిచేసిన ఎస్ఐ జనార్ధనరావు ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలు పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

మరిన్ని సంక్షేమ పథకాలు

వేపాడ: సిఎం జగన్మోహన్‌రెడ్డిని మరోసారి 2024లో సిఎంను చేస్తే మరిన్ని సంక్షేమ పథకాలు పొందే అవకాశం ఉందని జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని వీలుపర్తి, వల్లంపూడి గ్రామాల్లో గురువారం జరిగిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. వల్లంపూడి గ్రామానికి చెందిన 18 మంది పిల్లలకు అమ్మఒడి రాలేదని వారి తల్లిదండ్రులు జిల్లా పరిషత్తు చైర్మన్ దృష్టికి తీసుకొచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, ఏఎంసి చైర్‌పర్సన్ ఎం. కస్తూరి, జెడ్‌పిటిసి ఎస్. అప్పలనాయుడు, ఎంపిపి డి.సత్యవంతుడు, మండల అధ్యక్షులు ఎం. జగ్గుబాబు, సర్పంచులు, ఎంపిటిసిలు, గృహ సారధులు, వాలంటీర్లు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణులకు రూ. 20 వేలు జీతం

శృంగవరపుకోట: 110 జిఒ ద్వారా అర్హత పొందిన దేవాలయాల్లో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణులకు రూ. 20వేలు జీతాన్ని నిర్ణ యిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జిఒ జారీ చేయటంపై నాయి బ్రాహ్మణుల ముఖాల్లో ఆనందం వెల్లువిరుస్తుందని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. పట్టణంలోని పుణ్యగిరికి వెళ్లే రహదారిలో నాయి బ్రాహ్మణుల కమ్యూనిటీ బిల్డింగ్ వద్ద గురువారం నాయీ బ్రాహ్మణ కృతజ్ఞత సభ జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం బార్బర్ షాపులకు 150 యూనిట్ల ఉచిత విద్యుత్, దేవాలయ బోర్డులో ఒకరికి మెంబర్‌గా అవకాశం, కేశ ఖండన టిక్కెట్ 25 నుంచి 40 రూపాయలకు పెంచడం, 110 జీవో ద్వారా అర్హత కలిగిన దేవాలయాలలో జీతాలు వచ్చే విధంగా జీవోలు విడుదల చేసి ఎంతో మేలు చేశారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయీ బ్రాహ్మణ జిల్లా అధ్యక్షులు రామేశ్వరపు రామారావు, అతవ రమేష్, టి.సుందర్ రావు, కోడూరు శ్రీను, ఐదు మండలాల నాయీ బ్రాహ్మణులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు అంతరాయం

లక్కవరపుకోట : మండలంలోని పలు గ్రామాలలో శుక్రవారం ఉదయం 7 నుండి 11 గంటల వరకు విద్యుత్తును నిలిపివేయనున్నట్లు ఎఇ ఎన్ కృష్ణమూర్తి గురువారం తెలిపారు. గనివాడ ఫీడర్ నుండి మల్లివీడు 11 కెవి సబ్ స్టేషన్ పరిధిలో అభివృద్ధి పనుల నిమిత్తం విద్యుత్తు సరఫరాను నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. ప్రజలు సహకరించాలని కోరారు.

ఎఫ్‌పిఒ క్షేత్రస్థాయిలో బలోపేతం

బాడంగి: రైతుల ఎఫ్‌పిఒ క్షేత్రస్థాయిలో బలోపేతం కావాలని గుంటూరు ఉద్యాన శాఖ కమిషనరేట్ అధికారి ఎస్‌వి రత్నాచారి అన్నారు. గురువారం బాడంగి సమీపంలో అక్షయ వ్యవసాయ ఉత్పత్తుల సంఘాన్ని క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ సంఘాలు వ్యాపారరంగాల్లో ఎలా బలోపేతం కావాలో వివరించారు. సంఘాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు సంస్థ సిఇఒ, డైరెక్టర్లు తమ వంతు కృషి చేయాలన్నారు. సంఘాల ద్వారా వ్యాపారం చేస్తున్నటువంటి కూరగాయలు పండ్లు తదితర వస్తువులను గ్రేడింగ్ చేసి క్లీనింగ్ చేసిన తర్వాత ప్యాకింగ్ విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. రైతు సంఘం వ్యాపార లావాదేవులు కోటి రూపాయలు ఉండాలని ఆయన సూచించారు. దీక్ష మహిళా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నాబార్డ్ సహకారంతో నిర్వహిస్తున్న ఎఫ్‌పిఒలు రైతులకు పండించినటువంటి పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో విజయనగరం ఉద్యాన శాఖ ఏడిహెచ్ కే శైలజ, రామభద్రపురం ఉద్యాన అధికారి మోహన్ కృష్ణ, దీక్ష మహిళా వెల్ఫేర్ సొసైటీ సిఇఒ ఎల్.శాంతి, అక్షయ సిఇఒ డి.లక్ష్మి అధికారులు, రైతులు పాల్గొన్నారు.

తెర్లాం : మండలంలోని జగన్నాథవలస గ్రామంలో వ్యవసాయ అనుబంధ ఉత్పత్తిదారుల రైతు సహాయక సహకార సంఘం ఆధ్వర్యంలో నిర్మాణమైన కలెక్షన్ సెంటర్, 10 టన్నుల సామర్థ్యం గల కోల్డ్ స్టోరేజ్ గౌడన్‌ను గుంటూరు ఉద్యాన శాఖ కార్యాలయం ఏడి ఎస్‌వి రత్నాచారి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌పిఒ అభివృద్ధి పదంలో నడవడానికి తగిన సూచనలు సలహాలు ఇచ్చారు. రైతుల సందేహాలను నివృత్తి చేశారు. మామిడి రైతు సంఘం ద్వారా ఎలా బిజినెస్ చేసుకోలో నన్న వివరాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం ఉద్యానవన శాఖాధికారి శైలజ, బొబ్బిలి ఉద్యాన శాఖ అధికారి మోహన్ కృష్ణ, ఎఫ్.పి.జి చైర్మన్ జి వెంకట్రావు, ఏపిఎం టి రాము, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

ముస్లిములకు రంజాన్ తోఫా పంపిణీ

బొబ్బిలి : రంజాన్ సందర్భంగా నియోజవర్గంలో ముస్లింలకు టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన గురువారం రంజాన్ తోఫా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలంతా రంజాన్ ఘనంగా నిర్వహించేందుకు రంజాన్ తోఫా పంపిణీ చేసినట్లు చెప్పారు. రంజాన్ రోజున ముస్లింలకు టీడీపీ హయాంలో రంజాన్ తోఫా ఇస్తే వైసీపీ ప్రభుత్వం ఇవ్వకపోవడం అన్యాయ మన్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే రంజాన్ తోఫా ముస్లింలకు ఇస్తుందని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని తాటిపాడు గ్రామంలో షాదీ మంజిల్లో ముస్లిం కమ్యూనిటీ పెద్దలు ఆధ్వర్యంలో ముస్లిం సోదరులు రంజాన్ ఉపవాస దీక్షలో భాగంగా గురువారం రంజాన్ ఇఫ్తార్ విందుకు ఎమ్మెల్యే కంబాల జోగులు హాజరయ్యారు. ముందుగా

బొబ్బిలి: రంజాన్ తోఫా పంపిణీ చేస్తున్న బేబినాయన

ముస్లిం సోదరులతో ప్రార్థన చేశారు. కంబాల జోగులులతో పాటు వైస్ ఎంపిపి వావిలపల్లి జగన్ మోహన్ రావు, మండల విప్ మజ్జి శ్రీనివాసరావు, సచివాలయం కన్వీనర్ పేడ్డ బాబురావు నాయుడు, సంకిలి పిఎసిఎస్ డైరెక్టర్ పేడ్డ రామి నాయుడు, స్థానిక సర్పంచ్ పేడ్డ అశ్వనీ కృష్ణవేణి తదితరులున్నారు.

వాకింగ్ ట్రాక్ ఏర్పాటు

డెంకాడ : మండల కేంద్రంలో వాకింగ్ ట్రాక్ నిర్మిస్తున్నట్టు పిఎస్‌సిఎస్ చైర్మన్ రొంగలి కనక సింహచలం అన్నారు. ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడుతూ సచివాలయం ఎదురుగా ఉన్న కోనేరు ప్రస్తుతం వినియోగం లేదని దాన్ని బాగు చేసి రొంగలి సత్యవతి స్వచ్ఛంద సేవా సంస్థ పేరిట వాకింగ్ ట్రాక్ వేస్తామన్నారు. ఇందులో భాగంగానే జెసిబితో పనులు చేయిస్తున్నామన్నారు. గట్టుమీద ఉన్న మట్టిని తొలగించి ముందుగా రోడ్డు తయారు చేయిస్తామని, ఆ తర్వాత వాకింగ్ ట్రాక్ ఉపయోగపడే విధంగా తయారు చేస్తామని వెల్లడించారు. గ్రామస్తులు అందరూ వాకింగ్ కి గ్రామానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న రియల్ ఎస్టేట్ సైట్లకు వెళ్లి అక్కడ వాకింగ్ చేయవలసి వస్తుందని గుర్తు చేశారు. వారిని దృష్టిలో పెట్టుకొని గ్రామం మధ్యలో ఉన్న కోనేరు అభివృద్ధి చేసి తన సొంత నిధులతో వాకింగ్ ట్రాక్‌గా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ వాకింగ్ ట్రాక్‌ను గ్రామస్తులు వినియోగించుకోవాలని కోరారు. ముఖ్యంగా యువతకు ఇది ఎక్కువగా ఉపయోగపడుతుందన్నారు. గ్రామస్తులు పెద్దలు యువత దీనికి సహకరించాలని కోరారు.

ట్రాక్ వేస్తున్న జెసిబి

నేరాలు ఘోరాలు

ముగ్గురు అరెస్టు

గుర్ల: ముందస్తు సమాచారం మేరకు మండలంలోని కొండగండ్రేడులో పేకాట శిబిరం పై దాడిచేసి ముగ్గురు జూదగాళ్లను అరెస్టు చేశామని ఎస్ఐ హరిబాబు నాయుడు గురువారం తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 6,700 నగదు స్వాదీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గ్యాస్ సిలిండర్ పేలి నాలుగిళ్లు దగ్ధం

గరివిడి: చీపురుపల్లిలోని రుంకాన వీధిలో గురువారం గ్యాస్ సిలిండర్ పేలి నాలుగు ఇల్లు దగ్ధమయ్యాయి. స్థానికలు కథనం ప్రకారం.. రుంకాన కనక అనే మహిళ ఇంటిలో వంట చేస్తుంది. మంటలు ఒక్కసారిగా ఎగసి పడి పైకప్పుకు నిప్పంటుకుంది. భయంతో కనక బయటకు పరుగులు తీసింది. మంటలు ఇంటంతటికీ వ్యాప్తించడంతో గ్యాస్ సిలెండరుకు మంటలు తాకాయి. సిలెండర్ పేలడంతో మంటలు పక్కనే ఉన్న మరో మూడిళ్లకు వ్యాపించాయి. ఆ మూడిళ్లలో కూడా గ్యాస్ సిలెండర్లు ఉండడంతో జనం భయాందోళనకు గురయ్యారు. కొందరు ఇళ్లలో సామాన్లు బయటకు తీసే ప్రయత్నం చేస్తుంటే మరో కొందరు మంటలు అదుపు చేసే పనిలో పడ్డారు. మిగిలిన వాళ్ల తమ ఇళ్లలో ఉన్న సిలెండర్లను తీసి దూరంగా వెళ్లిపోయారు. మంటలను అదుపు చేసేందుకు గ్రామస్తుల ప్రయత్నం చేసి అగ్నిమాపక కేంద్రానికి సమాచారాన్ని అందించారు. హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది సుమారు గంటపాటు శ్రమించినా మంటలు అదుపులోకి రాకపోవడంతో జనం భయాందోళనకు గురయ్యారు. చివరకు గ్రామస్తుల సహకారంతో అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేయగలిగారు.

ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు

నెల్లిమర్ల: మాజీ సిఎం చంద్ర బాబు నాయుడు జన్మదిన వేడుకలను టిడిపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. గురువారం మండల టిడిపి అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో టిడిపి నియోజకవర్గం ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు ముఖ్య అతిథిగా చంద్ర బాబు నాయుడు జన్మదిన వేడుకలు మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సంధర్భంగా రామతీర్థంలో చంద్ర బాబు పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించి కేక్ కట్ చేశారు. అనంతరం దేవస్థానంలో అన్నదాన కార్యక్రమం జరిపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, ఎస్‌సి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పోతల రాజప్పన్న, నాయకులు బైరెడ్డి లీలా వతి, బొంతు వెంకట రమణ, గురాన అసిరి నాయుడు, నల్లం శ్రీని వాసరావు, తాడ్డి సత్య నారాయణ, కాళ్ళ రాజ శేఖర్, కె. దివాకర్, డి.రామ్మూర్తి, కలి శెట్టి సీతారాం, తదితరులు పాల్గొన్నారు. కాగా జరజాపు పేటలో పట్టణ టిడిపి ప్రధాన కార్యదర్శి అవనాపు సత్య నారాయణ ఆధ్వర్యంలో చంద్ర బాబు నాయుడు జన్మదిన వేడుకలు నిర్వహించారు.

డెంకాడ: మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బిఎన్ఆర్ అనాధ శరణాలయంలో మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్ కేక్ కట్ చేశారు. అనంతరం గంట్లాం వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పల్లె భాస్కర్ రావు, నాయకులు, కలిదిండి పాణీరాజు, కాగితాల సత్యనారాయణ రెడ్డి, పడాల చిన్నారావు తదితర నాయకులు పాల్గొన్నారు.

భోగాపురం : టిడిపి అధ్యక్షులు చంద్రబాబు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని నెల్లిమర్ల నియోజకవర్గ ఇంచార్జి కర్రోతు బంగారు రాజు ఆధ్వర్యంలో మండలంలోని సుందర పేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగులకు గురువారం పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. నందిగాం టిడిపి నాయకులు పోతిన శ్రీనివాసరావు ఆర్థిక సహకారంతో రోగులకు వీటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గరి వెంకటరమణ, సూర్య మాస్టర్, ముకుందరావు, పాముల నారాయణరావు, గరి వెంకటరమణ, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి ఏడు లక్షలు విరాళం

వేపాడ: గొంప కృష్ణ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులు

గుంటూరు జిల్లా వేమావరం గ్రామం వద్ద కోటిలింగాల శ్రీ మహాకాళి సహిత శ్రీ మహా కాళేశ్వర ఆధ్యాత్మిక సేవా సమితి నిర్మిస్తున్న కోటిలింగాల ఆలయానికి టిడిపి నియోజకవర్గం ఇంచార్జి కర్రోతు బంగార్రాజు రూ. 7లక్షలు విరాళం అందించారు. చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా ఈ విరాళం అందించినట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాజాం: రాజాం - చీపురుపల్లి రోడ్డులోని నటరాజ్ కళ్యాణ్ మండపంలో చంద్రబాబు పుట్టిన రోజు సందర్భంగా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇందులో 60 మంది యువత రక్తదానం చేసారు. అనంతరం దాతలకు సర్టిఫికెట్స్ అందజేశారు. పుట్టినరోజు కేక్ కట్ చేసి, అందరికీ కేక్‌తో పాటు స్వీట్స్ తినిపించారు. భారీ అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాజాం టౌన్ ప్రధాన కార్యదర్శి శాసపు రమేష్ కుమార్, వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ టంకాల కన్నం నాయుడు, సీనియర్ నాయకులు నంది సూర్యప్రకాశరావు, పొట్టా చిట్టిబాబు, బనిశెట్టి వెంకటరావు, పిల్లా సత్యం నాయుడు, శిమ్మ జగన్నాథం, పొట్నూరు సోమశేఖర్, పొట్నూరు ఈశ్వరరావు పాల్గొన్నారు.

బొబ్బిలి : స్థానిక కోటలో టిడిపి అధినేత చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీడీపీ పట్టణ, మండల అధ్యక్షులు రాంబార్కి శరత్, వి.సత్యనారాయణ, కార్యకర్తలు సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.త

1000 బైకులతో ర్యాలీ

నెల్లిమర్ల: కేక్ తినిపించుకుంటున్న నాయకులు

శృంగవరపుకోట : చంద్రబాబు నాయుడు 73వ జన్మదిన వేడుకలను మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, నియోజకవర్గ యువనేత గొంప కృష్ణ ఆధ్వర్యంలో వేరువేరుగా నిర్వహించారు. ముందుగా పట్టణంలో దుర్గాదేవి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్‌టిఆర్ విగ్రహానికి పాలాభిషేకం, పూలమాలలతో నివాళులు అర్పించిన, అనంతరం భారీ కేక్ కట్ చేశారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఎన్టీఆర్ విగ్రహం వద్ద అన్నదానం చేశారు. గొంప కృష్ణ ఆధ్వర్యంలో ఐదు మండలాల నుండి 1000 బైకులపై వచ్చిన యువకులతో ర్యాలీ నిర్వహించారు. రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి రెడ్డి వెంకన్న, మాజీ వైస్ ఎంపిపి నానిగిరి రమణాజీ, నాయకులు కొనదల మల్లీశ్వరరావు, కనిశెట్టి ఈశ్వరరావు, కాపుగంటి శ్రీనివాసరావు, ఇందుకూరి శ్రీనివాస రాజు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: చంద్రబాబు పుట్టిన రోజును పురష్కరించుకుని వేపాడ, వల్లంపూడిలోని ఎన్‌టిఆర్ విగ్రహాలకు టిడిపి నాయకులు పాలాభిషేకం చేశారు. మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం వేపాడ నుంచి ఎస్‌కోట వరకూ బైక్ ర్యాలీ నిర్వహించారు. మండల అధ్యక్షులు గొంప వెంకటరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ క్యాక్రమాల్లో నాయకులు గుమ్మడి భారతి, సిరికి రమణ, సేనాపతి గణేష్, జనపరెడ్డి ఈశ్వరరావు, వీలుపర్తి సర్పంచ్ ఎస్ లీల తదితరులు పాల్గొన్నారు.

చీరలు పంపిణీ : చంద్రబాబు పుట్టిన రోజును పురష్కరించుకుని మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఉపాధ్యక్షుడు పోతల రమణ, ప్రధాన కార్యదర్శి కె రమణమూర్తి, దాసరి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పూసపాటి రేగ : నారా చంద్రబాబు జన్మదినోత్సవం సందర్భంగా మండల పార్టీ అధ్యక్షులు మహంతి శంకారావు ఆధ్వర్యంలో గురువారం కందివలస శిర్డిసాయి ఆలయంలో టిడిపి శ్రేణులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కోనాడ జంక్షన్లో గల వికలాంగుల విద్యాలయంలో కేక్ కట్ చేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు పతివాడ అప్పలనాయుడు, దంగా భూలోకా, పిన్నింటి సన్యాసినాయుడు, పసుపులేటి గోపి, పిన్నింటి శ్రీనువాసరావు, కె గోవింద, ముత్యాల వెంకటరమణ, పి. లక్ష్మనాయుడు, బొంతు రవి, చందక ఆనందరావు పాల్గొన్నారు.

కొత్తవలస: మండలంలో చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలు ఎస్ కోట మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, రాష్ట్ర టిడిపి కార్యనిర్వా కార్యదర్శి కోళ్ల బుచ్చి రాంప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మానసిక వికలాంగుల పాఠశాల, న్యూ హొూప్ పాఠశాలలో ఈ వేడుకలను నిర్వహించారు. స్థానిక నాలుగు రోడ్ల కూడలి వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం 500 మంది పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిని నాయకులు బొబ్బిలి అప్పారావు మాస్టర్, కోళ్ల వెంకటరమణ, కనకాల శివ, బంగారు రమేష్, కోరుపోలు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జామి: మండల కేంద్రంలో టిడిపి అధినేత నారా చంద్రబాబు జన్మదిన వేడుకలు మాజీ జెడ్‌పిటిసి బండారు పెదబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక బస్ స్టాండ్‌లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జామి మాజీ సర్పంచ్ ఇప్పాక వెంకట త్రివేణి, టిడిపి నాయకులు రెడ్డి పైడిబాబు, వెంద్రపు నాయుడుబాబు, రాయవరాపు శంకర్రావు పాల్గొన్నారు.

గరివిడి: చీపురుపల్లి టిడిపి కార్యాలయంలో చంద్రబాబు జన్మదిన వేడుకలను నియోజకవర్గ ఇంచార్జి నాగార్జున ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. సాయి బాబా మందిరంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. బాపూజీ వృద్ధాశ్రమం, ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రౌతు కామనాయుడు, పైల బలరాం, దన్నాన రామచంద్రుడు, సారేపాక సురేష్ కుమార్, చనమల మహేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

చీపురుపల్లి: రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న నాయకులు

బొబ్బిలి: కోటలో కేక్ కట్ చేస్తున్న టిడిపి నాయకులు

పేపరు పబ్లికేషన్
మహారాజశ్రీ గజపతినగరం జూనియర్ సివిలు జడ్జివారి కోర్టులో
O.S.54/2020

Between :
దత్తి బంగారు నాయుడు ....వాది
And:
మరడ రామకృష్ణ ....ప్రతివాది
To
ప్రతివాది ఎడ్రాసు : (ప్రతివాది): మరడ రామకృష్ణ తండ్రి లేటు రామమూర్తి, వయస్సు 32 సం॥లు హిందూ, వ్యవసాయం, సా॥ వంగర గ్రామం, దత్తిరాజేరు మండలం మండలం, విజయనగరం జిల్లా. AP.

Hg Date: 05-05-2023

పై నెంబరు దావాలో ప్రతివాది నోటీసు తీసుకొనకుండా తిరుగుచున్నందున శ్రీ కోర్టువారు సదరు ప్రతివాదికి ఈ పేపరు ప్రకటన ద్వారా **తే 05-05-2023దీ**న హాజరు నిమిత్తం ఉదయం **గం॥ 10-30 ని॥**లకు ఖుద్దున గాని వకీలు గారు ద్వారాగాని పైన తెల్పిన కోర్టులో హాజరు అయి ఏమైన ఆక్షేపణలు యున్న యెడల తెలియపరుచుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున విచారించి తీర్మానించబడునని యిందుమూలముగా ప్రతివాదికి తెలియజేయడమైనది.

//బై కోర్టు ఆర్డర్//

శ్రీ ఉప్పలపాటి రమేష్
వాదితర్పు న్యాయవాది,
గజపతినగరం, విజయనగరం జిల్లా
సెల్: 9866454030